
మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి**

సంగెం, జూలై 19 : రాష్ట్రం ప్రభుత్వ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి అన్నారు. బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పురుషోత్తం అధ్యక్షతన బుధవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. యువత సోషల్ మీడియాలో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలన్నారు. ఐదు నెలల పాటు కష్టపడి పార్టీ కోసం పనిచేయాలన్నారు. ప్రతి పక్షాల అసత్య ఆరోపణలు తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ సమితి కన్వీనర్ కందకట్ల నరహరి, జాగృతి జిల్లా అధ్యక్షుడు యార బాలకృష్ణ, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పోడేటి ప్రశాంత్, బొమ్మాల శంకర్, ఉప సర్పంచ్ కక్కెర్ల శరత్, భరత్‌రెడ్డి, చిర్రి రాజ్‌కుమార్, రమేశ్‌బాబు, సుభాస్,రాజేశ్, గోవర్ధన్, సోషల్ మీడియా నాయకులు పోశాల ప్రవీణ్, చిర్ర రాజు, ప్రమోద్, శశి, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి రూ. 2లక్షలు మంజూరు

శాయంపేట, జూలై 19 : మండలంలోని మైలారం గ్రామాన్ని ఎల్ఐసీ సంస్థ బీమా గ్రామంగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ సంస్థ పరకాల బ్రాంచ్ మేనేజర్ ఎం విశ్వనాథం రూ. 2 లక్షల మంజూరు పత్రాన్ని బుధవారం స్థానిక సర్పంచ్ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలారం గ్రామస్తులు అత్యధికంగా ఎల్ఐసీ పాలసీలు తీసుకున్నట్లు చెప్పారు. దీంతో మైలారం గ్రామాభివృద్ధి కోసం ఎల్ఐసీ రూ.2 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఎల్ఐసీ పాలసీ తీసుకొని కుటుంబానికి రక్షణగా నిలవాలని కోరారు. అత్యధికంగా పాలసీలు చేసిన గ్రామ అభివృద్ధి కోసం నిధులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏబీఎన్ అరుణ్ మిత్ర, ఉప సర్పంచ్ సునీతా సాంబరెడ్డి, ఎల్ఐసీ ఏజెంట్లు దూదిపాల బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ తదితలు పాల్గొన్నారు.

## ప్లాంట్‌ను ఏర్పాటు చేయొద్దు

ఆత్మకూరు, జూలై 19 : మండలంలోని కటాక్షపురం గ్రామంలో ఓరుగల్లు బయోఫియాల్ ప్రైవేట్ కంపెనీ ఏర్పాటు చేయొద్దని సర్పంచ్ మచ్చిక యాదగిరి ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆ కంపెనీ ద్వారా ప్రజలు, పశువులకు ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి కంపెనీలు తమ గ్రామంలో ఏర్పాటు చేయొద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కుడుతాల రమేశ్, ఒన్నాల భిక్షపతి, గ్రామస్తులు కొమ్మిడి మోహన్‌రెడ్డి,బాసిడి మహేందర్, ఎండీ గపూర్, సిరంశెట్టి సుమన్, రాజూనాయక్, ప్రశాంత్, శ్రీధర్, వెంకటేశ్, సతీశ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యాభివృద్ధికి సహకారం

నడికూడ, జూలై 19: మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యాభివృద్ధికి శ్రీ సాయి ట్రస్టు వారు బుధవారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ సాయి ట్రస్టు నిర్వాహకులు ఉపాధ్యాయులు పోలంపల్లి విజేందర్, ప్రభావతి దంపతుల సహకారంతో ఇద్దరు ప్రైవేటు ఉపాధ్యాయులను ఏర్పాటు చేశామన్నారు. వారికి నెలకు 6వేల గౌరవ వేతనాన్ని విజేందర్, శ్రీనివాసరావు, డాక్టర్ వంగళ వేణుగోపాలరావు, నల్లెల్ల సత్యనారాయణ, సింధు కృష్ణ, చల్ల ఉమ తమ వేతనాల నుంచి సర్దుబాటు చేస్తున్నారని తెలిపారు. దాతలను సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ, ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

## మంగళ్‌పాండే జయంతి

పరకాల, జూలై 19: స్వాతంత్ర్య సమరయోధుడు మంగళపాండే జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరధామంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను మంగళ్‌పాండే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సాధనకు మంగళ్‌పాండే ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీ శ్రీనివాస్, బొచ్చు జేపీ, ఎండీ బియాబానీ, బండి వెంకటేశ్ బొచ్చు సుజిత్ కుమార్ పాల్గొన్నారు.


మంగళ్‌పాండే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మడికొండ శ్రీను

# వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అనితా రామకృష్ణ
- లోతట్టు ప్రాంతాల పరిశీలన

పరకాల, జూలై 17: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ సూచించారు. పట్టణంలోని 13,14వార్డుల్లోని పలు లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరుస వర్షాలతో పట్టణంలోని పలు కాలనీల్లో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు చేపట్టామన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ప్రజలు స్థానిక కౌన్సిలర్ దృష్టికి లేదా మున్సిపల్ అధికారులకు తెలియజేయాలని కోరారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావొద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు శనిగరపు రజిని, మార్క ఉమాదేవి, మున్సిపల్ సిబ్బంది మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ సోదా అనితా రామకృష్ణ, అధికారులు

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

శాయంపేట : వర్షాలు పడుతున్న దృష్ట్యా రైతులు, గృహ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగెలను తాకవద్దని పేర్కొన్నారు. ముఖ్యంగా దుస్తులు ఆరేసే తీగలకు వైర్లు తాకకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ తీగలకు అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలను తాకవద్దని, రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లవద్దని స్టార్టర్ డబ్బాలు నీటిలో తడువకుండా చూసుకోవాలన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి ప్రమాదాల బారిన పడవద్దన్నారు. అలాగే గురువారం అన్ని గ్రామాల్లో కరెంటు బిల్లులు తీసుకుంటారని చెప్పారు. బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు.

# చలివాగు ప్రాజెక్టుకు జలకళ


17 అడుగులకు చేరిన చలివాగు నీటి మట్టం

శాయంపేట, జూలై 19 : మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు జలాశయం జలకళను సంతరించుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతున్నది. బుధవారం సాయంత్రం వరకు చలివాగు ప్రాజెక్టు నీటి మట్టం 17 అడుగులకు చేరినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్పారు. మరో అడుగు నీటి మట్టం పెరిగితే అలుగు పోస్తుందని పేర్కొన్నారు. ఉపరితల ఆవర్తనంతో ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. ఈ క్రమంలో చలివాగులోకి వరద నీరు చేరుతున్నది. పరకాల, శాయంపేట, రేగొండ, చిట్యాల వరకు చలివాగు ప్రాజెక్టుపైనే ఆధారపడి పంటలు సాగవుతున్నాయి. ప్రాజెక్టు నీటి ధార చిట్యాల వరకు పోతుండడంతో వాగుపై వందల ఎకరాల ఆయకట్టు సాగవుతున్నది. చలివాగు జలాశయం కింద 3,048 ఎకరాల ఆయకట్టు ఉన్నా ఐదు వేలకుపైగానే సాగునీరు అందిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. చలివాగు ప్రాజెక్టు 21 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం ఉన్నది. భీంఘన్‌పూర్ నుంచి గోదావరి జలాలను చలివాగులోకి నింపుతున్నారు. అయితే వానలతో రెండు రోజులుగా పంపింగ్‌ను బంద్ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. చలివాగు నుంచి ధర్మసాగర్‌కు పంపింగ్ చేస్తున్నారు. చలివాగు ఆయకట్టు కింద వానకాలం సాగుకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఇటీవల నీటిని విడుదల చేశారు.

## రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నేడు నిరసన

పరకాల, జూలై 19: రాష్ట్రంలో వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ వైఖరికి నిరసనగా నేడు పరకాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొంటారని, మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఓటర్ల పేర్లను నమోదు చేయాలి

దామెర, జూలై 19: మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని బీఎల్‌వోలకు తహసీల్దార్ రియాజుద్దీన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బూత్‌స్థాయి అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సతీష్‌బాబు



కరీమాబాద్, జూలై 19: మామునూరు సబ్ డివిజన్ ఏసీపీగా సతీష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏసీపీ కృపాకర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సతీష్‌బాబు వచ్చారు. సీఐ క్రాంతికుమార్ ఏసీపీ సతీష్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు.

## కూరగాయల మార్కెట్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు

కాశీబుగ్గ, జూలై 19 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా ఉన్న లక్ష్మీపురం మాడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు కోఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం లక్ష్మీపురంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నారాయణ సొసైటీ గురించి వివరించారు. చైర్మన్‌గా బిట్ల కృష్ణ, కార్యదర్శిగా ఎండీ అలీ, ఉపాధ్యక్షులుగా పాపని భాస్కర్, నమిండ్ల సూరయ్య, మురళి, కొండ హరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఖిలావరంగల్, జూలై 19: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు సూచించారు. బుధవారం డివిజన్‌లోని ఆదర్శనగర్ కాలనీని పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపగాని శంకర్, నిమ్మకాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# హరితహారం లక్ష్యాలను చేరుకోవాలి

**ఎంపీడీవో కృష్ణమూర్తి**

శాయంపేట, జూలై 19 : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో హరితహారం లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో అమంచ కృష్ణమూర్తి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో పెంచిన మొక్కలను పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనులు ప్రస్తుతం ఏమి లేవన్నారు. ప్రస్తుతం హరితహారంపైనే దృష్టి పెట్టాలని సూచించారు. శాయంపేట మండలానికి ఈ హరితహారంలో టార్గెట్ లక్షా 54వేలు ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో 65వేల మొక్కలు ఇంటింటికీ 6 మొక్కల చొప్పున 11వేల ఇండ్లకు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. మిగిలిన 89వేల మొక్కలు రోడ్లు, రైతులకు హార్టికల్చర్, క్రీడా ప్రాంగణాలు, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, చెరువు కట్టలు, కెనాల్ కట్టల వద్ద నాటించాలని చెప్పారు. అవెన్యూ, కమ్యూనిటీ, బయోఫెన్సింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి బుర్ర రంజిత్‌కుమార్, ఏపీవో అనిత ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణమూర్తి

### మొక్కలు పంపిణీ

ఆత్మకూరు : మండల కేంద్రంలో బుధవారం హరితహారంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం మండల తిరుపతిరెడ్డి ఇంటి వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ వంగాల భగవాన్‌రెడ్డి, వార్డు సభ్యులు పాపని రవీందర్, రేవూరి ప్రవీణ్‌రెడ్డి, రేవూరి శ్యాంసుందర్‌రెడ్డి, బైగాని రాజేందర్, కార్యదర్శి మేడ యాదగిరి,ఏపీవో డీ రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.